క్లుప్తంగా

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మునగపాకలో ఉపాధిహామీ పథకం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. మునగపాకలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువులు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అలాగే పని చేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతున్నాయన్నారు. వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అర్హులైన కూలీలకు జాబ్‌కార్డులు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులు తయారు చేసిన కాగితపు పూలు

మునగపాక: మంగళవరపుపేటలోని మా ఊళ్లో గ్రంథాలయం ద్వారా నిర్వహిస్తున్న చదవడం అంటే మాకు ఇష్టం కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తుంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం డ్రాయింగ్ టీచర్ జ్యోతిర్మయి సహకారంతో పిల్లలకు వివిధ రంగుల కాగితాలతో కాగితపు పూలు తయారు చేయించారు. ఈ పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పిల్లల్లో నైపుణ్యం పెరిగి తద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని టీచర్ జ్యోతిర్మయి పేర్కొన్నారు. ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేపర్‌క్రాఫ్ట్‌లపై శిక్షణ



పేపర్‌క్రాఫ్ట్‌లు తయారు చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీసోర్స్ పర్సన్స్ నీతికథలు చెప్పారు. పేపర్‌క్రాఫ్ట్‌ల తయారీపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం చేయించారు. వేసవి సెలవుల్లో పిల్లలకు మేలు జరిగేలా ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ నూకినాయుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలి



ఉప్పవరంలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం : గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించి,రోజుకు సరాసరిన కూలీ 600 రూపాయలు వచ్చేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. శనివారం ఆయన ఉప్పవరంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. శంకర్‌రావు, వెంకటరత్నం, మంగ, రామలక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : పట్టణంలో ఆదివారం 4వ వార్డు నుంచి 19 వార్డులకు 25వ వార్డుకు మంచినీటి సరఫరా ఉండదని ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి ప్రభాకర్రావు మీడియాకు తెలిపారు. పట్టణానికి నీటి సరఫరా జరిగే సోముదేవపల్లి హెడ్ వాటర్ వర్క్స్‌కు శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బంది తలెత్తిందని ఆయన చెప్పారు.ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్టు తెలిపారు.



మునగపాక సంతబయిలలో తమలపాకులతో పూజలందుకుంటున్న హనుమాన్



మునగపాకలో అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మునగపాకలో అన్న సమారాధనలో భక్తులు



నక్కపల్లి ప్రసన్నాంజనేయస్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నక్కపల్లిలో వేదపండితుల ఆధ్వర్యంలో ఆంజనేయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



మంగవరంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దిమిలిలో భక్తులకు దర్శనమిచ్చిన ఆంజనేయస్వామి



మంగవరంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న భక్తులు



కేశవరంలో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఎస్.రాయవరంలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉదయం నుంచి అభయాంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభయాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మునగపాకలోని సంతబయిల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులతో అభయాంజనేయ స్వామిని అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి, పాటిపల్లి, మంగళవరపుపేట,గవర్ల అనకాపల్లి తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

యలమంచిలి : హనుమాన్ జయంతి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. భక్తులు అభయాంజనేయస్వామి వారికి దీప ధూప నైవేద్యాలతో, తమలపాకు దండలు పత్రి ఫల పుష్పాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో అన్నసమారాధన ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. సాయంత్రం అంజనేయస్వామి వారి ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళల కోలాటాలు,చెక్క భజనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పాయకరావుపేట : హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో గల లింగాలకాలనీ, బృందావనం, మండలంలో గల మంగవరం, గుంటపల్లి, కేశవరం, సత్యవరం, అరట్లకోట తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడినవి. మంగవరం గ్రామంలో భారీ అన్నధాన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నక్కపల్లి : హనుమాన్ జయంతిని శనివారం వాడవాడలా భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మండల కేంద్రంలో ప్రసన్నాంజనేయ స్వామివారికి తెల్లవారు జామునుంచే సింధూరంతో విశేష పూజలు, ఆంజనేయ హోమాలు నిర్వహించారు. ఇక్కడ స్వామివారు ఎంతో ప్రసిద్ధి గాంచిన వారు కావడంతో మండల కేంద్రలో ఉన్న ప్రజలతో పాటు ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వేదపండితులతో ఆంజనేయహోమాలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. దేవవరం, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు, గొడిచర్ల, కాగిత తదితర గ్రామాల్లో కూడా హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు.అనంతరం అన్న సమారాధన జరిపారు. ఆలయంలో ఏకాహంతోపాటు, వివిధ సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు ఏర్పాటు చేశారు. నక్కపల్లిలో జరిగిన పూజా కార్యక్రమాలో ఆలయకమిటీ ప్రతినిధులు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్, కోసూరు శ్రీను, శ్రీపాదప్రణవ్‌రామ్, వీసం రాజు , పెదిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలో హనుమజ్జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్.రాయవరం, కొరుప్రోలు, అడ్డురోడ్డు, సర్వసిద్ధి, పెనుగొల్లు , ధర్మవరం, గుమ్మలూరు తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక తమలపాకు పూజలు నిర్వహించారు. రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొలిశెట్టి గోవిందు, కొణతాల శ్రీను తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

యలమంచిలి రూరల్: భక్త వల్లభుడు ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను శనివారం యలమంచిలి పట్టణం, మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు,అభిషేకాలు, విశేష పూజలు చేశారు. పట్టణంలోని బస్టాండు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు రేజేటి నారాయణాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సింధూరం, నిమ్మకాయలు, తమలపాకులతో స్వామివారిని అలంకరించారు. స్వామికి ఇష్టమైన అప్పాలను నైవేద్యంగా పెట్టారు.



తులసీనగర్‌లో ప్రత్యేక అలంకరణలో పంచముఖి ఆంజనేయస్వామి

పట్టణంలోని అత్తిలివారి వీధిలో వాయుపుత్రుని ఆలయంలో మహిళలు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. తులసీనగర్ సమీపంలో పంటపొలాల్లో కొలువుదీరిన పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తమలపాకులు, పూలదండలతో స్వామిని అలంకరించారు. ఆడారి ఆదిమూర్తి, ఆడారి నాయుడు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు చోట్ల భారీగా అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.



యలమంచిలిలో వాయుపుత్రునికి పూజలు చేస్తున్న పట్టణానికి చెందిన వ్యాపారులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి సన్నిధిలో అర్చకులు, పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు . భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వాడవాడలా అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. పలుచోట్ల భజనలు, కోలాటాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామాల్లో పండగ శోభ కనిపించింది.

21 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు



2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థులు

కోటవురట్ల : వాళ్లంతా నిక్కర్లు వేసుకునే కాలంలో విడిపోయారు. ఒకరి ముఖాలు ఒకరు మరిచిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఇపుడు మళ్లీ 21 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకుంటూ గుర్తుపట్టినట్టుగా నటిస్తూ.. ఆప్యాయంగా పలకరించుకున్నారు. వీరంతా కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్లో 2002-2003లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు. అదే పాఠశాలలో శనివారం కలుసుకున్నారు. వారి ఆత్మీయ సమ్మేళనంతో పాఠశాల ఆవరణ పరవశించింది. ఆనాటి తీపి గుర్తులు, గురువుల బెత్తం దెబ్బలు, తొడపాశాలను గుర్తుకు తెచ్చుకుని మనసారా నవ్వుకున్నారు. ఇపుడున్న సాధక బాధకాల నుంచి కాసేపు ఉపశమనం పొంది మళ్లీ చిన్న పిల్లల్లా మారిపోయారు. తమకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పచ్చార అర్జునరావు, ఎం.నాగేష్, గోవిందు, జయబాబు ఆర్గనైజ్ చేయగా పాఠశాల హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు రాజు, ప్రసన్నకుమార్, జె.వి.ప్రసాదరావు, కనకారావు, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని 31 వాహనాలు స్వాధీనం

పెదపల్లిలో పోలీసుల కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీన పరుచుకున్న మోటార్ వాహనాలు

యలమంచిలి : సరైన పత్రాలు లేని వాహనాల తనిఖీల్లో భాగంగా యలమంచిలి సీఐ షేక్ గఫూర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పెదపల్లి వీధుల్లో వచ్చే వాహనాలు, ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తనిఖీలు చేసి వాహనాలు పత్రాలు, రికార్డులు పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని యలమంచిలి సర్కిల్ కార్యాలయానికి తరలించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగం గ్రామాల్లో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపడుతున్నామని సీఐ షేక్ గఫూర్ అన్నారు. ఈ కార్డన్ సెర్చ్ కార్యాక్రమంలో యలమంచిలి రూరల్ ఎస్సై పి.సింహాచలం, పట్టణ ఎస్ఐ కె. పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో విద్యాకానుక కిట్‌లు



ఎంఆర్‌సీ కార్యాలయంలో పుస్తకాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక : ఈ ఏడాది విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. శనివారం ఎంఆర్‌సీ భవనానికి చేరుకున్న పుస్తకాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12 నాటికి విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. విద్యాకానుక కిట్‌లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఈవో-2 శివనాయుడు, సీఆర్పీలు అచ్యుతకృష్ణ, కర్రి లక్ష్మినారాయణ, జి.నూకేష్, సత్తిబాబు, గోవింద, వీరప్పారావు, రామలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ.40 లక్షల నాబార్డు నిధులతో గోదాం

కోటవురట్ల (కశింకోట): మండలంలోని జమాదులపాలెం గ్రామం వద్ద రైతులకు ప్రయోజనం కలిగించే బహుళ ప్రయోజన సౌకర్యాల గోదాం నిర్మించారు. ఇందుకు రూ.40 లక్షల నాబార్డు నిధులు సమకూర్చింది. రైతులు పండించిన ఉత్పత్తులను ఇక్కడ నిల్వ ఉంచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించుకోవడానికి దీనివల్ల అవకాశం కలగనుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం జిల్లాలో మొదటి విడతగా ఒక్కొక్కటి రూ.40 లక్షలతో 9 బహుళ ప్రయోజన సౌకర్య గోదాంలను మంజూరు చేసింది. దీనిలో భాగంగా మండలంలోని జమాదులపాలెం వద్ద గోదాం మంజూరైంది. దీనికి ప్రభుత్వం నుంచి ఎకరం భూమిని సమకూర్చింది. నాబార్డు నుంచి ఆప్కాబ్ ద్వారా సమకూర్చిన రుణంతో దీన్ని నిర్మించారు. 500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు నిల్వ ఉంచుకోవడానికి అనువైన సామర్థ్యంతో నిర్మాణం పూర్తి చేశారు. దీనిలో నిల్వ ఉంచుకొనే ఉత్పత్తులకు రైతుల నుంచి పరిమాణం, నిబంధలు అనుసరించి వసూలు చేసే అద్దెతో గిడ్డంగి నిర్మాణానికి సమకూర్చిన నిధుల్లో రూ.35 లక్షలు 4 శాతం వడ్డీతో 30 ఏళ్లలో రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది. కశింకోట పీఏసీఎస్ ద్వారా రుణం చెల్లించాల్సి ఉంటుంది. ఈ గిడ్డంగి వల్ల చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తమ ఉత్పత్తులు తెచ్చుకొని నిల్వ ఉంచుకోవడానికి అవకాశం కలగనుంది. ధర తక్కువగా ఉన్నప్పుడు నామమాత్రపు అద్దె చెల్లించి వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ నిల్వ ఉంచుకుంటారు. ధర ఎక్కువ పలికినప్పుడు ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించి గిట్టుబాటు ధర పొందడానికి అవకాశం కలగనుంది.

కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించే బాధ్యత అధికారులదే

ఆర్‌వో గీతాంజలి



సమావేశానికి హాజరైన వీఆర్వోలు, కార్యదర్శులు



సిబ్బందిని ఉద్దేశించిమాట్లాడుతున్న ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 4వ తేదీన జరిగే కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆర్‌వో గీతాంజలి తెలిపారు. శనివారం ఆమె వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర రెవెన్యూ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించే బాధ్యత అధికారులదేనన్నారు. అనకాపల్లి జిల్లాకలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న కళాశాలలో పాయకరావుపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. 22 రౌండ్లలో ఓటర్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారన్నారు. లెక్కింపు కోసం నియమితులైన వీఆర్వోలు, కార్యదర్శులు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది అంతా కౌంటింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. వారికి కేటాయించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్‌రూముల నుంచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చే సమయంలో సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా పారదర్శకంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. నాలుగోతేదీ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్‌కేంద్రాలవద్ద 144వ సెక్షన్ అమలుతో పాటు, భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. లెక్కింపు అనంతరం ఫలితాలు వెలువడిన సమయంలో గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు, బాణా సంచా కాల్చడం వంటివి నిషేధించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్‌లు కలిగిన వారు, ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రాల వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. నక్కపల్లి ప్రభుత్వ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్లను భద్రపరచడం జరిగిందని, వీటిని భారీ బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, హెచ్‌డీటీలు, ఎన్నికల డీటీలు,పాల్గొన్నారు.

మత్స్యకారులకు ద్విచక్ర వాహనాల పంపిణీ



మత్స్యకారులకు అందజేసిన టీవీఎస్ వాహనాలు

అచ్యుతాపురం : మత్స్యకారులకు అండగా ఉంటామని రామ్ కీ ఫౌండేషన్ ఎం.వి రామిరెడ్డి అన్నారు.అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవ వద్ద నిర్వహించిన రీ సస్టైయినబులిటీ లిమిటెడ్ సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 మంది మత్స్యకారులకు 16 టీవీఎస్ ద్విచక్ర వాహనాలు అందజేశారు. వలలు దాచుకునేందుకు నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. రీ సస్టైయిన్‌బులిటీ జనరల్ మేనేజర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ 300 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్న కొండకర్ల, వాడ్రాపల్లి ప్రాంతంలో సస్టైయిన్ బులిటీ లిమిటెడ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఇప్పటి వరకూ 31 ద్విచక్ర వాహనాలు,నాలుగు పడవలు, ఆర్థిక సహాయం అందజేశామని తెలిపారు.

మైదాపిండి లోడు లారీ బోల్తా



ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్



పెదపల్లి-రామ్‌నగర్ హైవే సమీపంలో బోల్తాపడిన లారీ

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి-రామ్‌నగర్ హైవే సమీపంలో శనివారం ఒక లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఒరిస్సా నుంచి విజయవాడకు మైదా పిండి బ్యాగ్‌ల లోడుతో వెళుతున్న లారీని యలమంచిలి పెదపల్లి జంక్షన్ సమీపం వద్దకు ఉదయం 10.30 గంటల సమయంలో వచ్చేసరికి డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా లారీ హైవే పక్కనున్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టి పల్టీలు కొట్టి సమీపంలో ఉన్న కాలువలో పడిపోయింది. ఈ లారీలో ప్రయాణిస్తున్న డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను, క్లీనర్‌ను స్థానికులు హుటాహుటిన బయటకు తీసి యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదని స్థానికులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి

రాంబిల్లి: ఉక్కబోతతో శనివారం మండలవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండతీవ్రతకు వేడిగాలులు తోడవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు నానా అవస్థలు పడ్డారు. అయితే శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం పడింది. ఉదయం 10 గంటల తర్వాత మాత్రం ఎండ, ఉక్కబోత హడలెత్తించింది.

15,16,17 తేదీలలో రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు

తుమ్మపాల : దేశంలో వ్యవసాయ భూమికి సాగునీటి సమస్యలను పరిష్కరించడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయని, వ్యవసాయధారిత పరిశ్రమలైన షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలను మూసివేస్తూ, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను దక్కనివ్వకుండా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై పెత్తనాన్ని బహుళ జాతి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని రాష్ట్ర రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు అన్నారు. రైతాంగ, గిరిజన, పీడిత ప్రజల హక్కుల కోసం గత 4 దశాబ్దాలుగా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను జూన్ 15, 16,17 తేదీలలో ఏలూరులో నిర్వహిస్తున్నట్లు, ఈ మహాసభలకు జిల్లాలోని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పేద ప్రజానీకమంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా కమిటీ, జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్‌లో కార్మిక, రైతు కూలీ సంఘాల నాయకులు గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి.జగదీశ్వరరావు, మరిసా సతీష్, క్వారీ కార్మిక సంఘం నాయకులు గడి.సూర్యారావు, ఎస్.సూరిబాబు, డి.జగ్గారావు, సిహెచ్ రమేష్, గొరప్లలి సన్యాసి రావు పాల్గొన్నారు.